క్లుప్తంగా

జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ



ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి

పామిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనులపై ఎంపీడీఓ తేజోత్స్నతో సమీక్షించారు. అలాగే వంకరాజుకాలువ గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సంపద తయారీ కేంద్రం ద్వారా ఆదాయంతో చేపట్టే గ్రామాభివృద్ధి పనులపై ఆయన సచివాలయ సిబ్బందితో ఆరా తీశారు. అలాగే పీ కొండాపురంలోని సమగ్ర రక్షిత నీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలకు సురక్షిత నీటిని అందించి ఆరోగ్యాలను సంరక్షించాలని ఈ సందర్భంగా ఆయన ఆ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

శింగనమల: మండలంలోని గురుగుంట్ల గ్రామంలో చింతాకు లక్ష్మమ్మ అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణవైద్య ఖర్చుల కోసం ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఆరోగ్యకరంగా ఉండాలని, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు, ఐచర్ ఢీ

తాడిపత్రి రూరల్: మండల సరిహద్దు ప్రాంతమైన కడప జిల్లా దత్తాపురం వద్ద మంగళవారం తెల్లవారుజామున వీర అండ్ శ్రీ కాళేశ్వరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ఐచర్ వాహనం ఢీ కొన్నాయి. వివరాలు.. విజయవాడ నుంచి తాడిపత్రికి వస్తున్న బస్సు, తాడిపత్రి నుంచి కడప వైపు వెళ్తున్న ఐచర్ వాహనం అదుపు తప్పి ఢీకొన్నాయి. ఘటనలో బస్సు ముందు వైపు ఉన్న అద్దాలు పలిగిపోయాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న రైల్వే కొండాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీవ్రతను పరిశీలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

గుత్తి: కాలనీలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు చంద్ర ప్రియనగర్ కాలనీవాసులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు గోరంట్ల నాగయ్య రాయల్, పురుషోత్తం, శీనా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి



గ్రామస్తుల ఇబ్బందులు తెలుసుకుంటున్న ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ జగన్‌మోహన్

గుంతకల్లు రూరల్: ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని ఎండీటీ ఆపరేటర్లను జిల్లా ఇన్‌చార్జ్ పౌరసరఫరాల అధికారి జగన్‌మోహన్ ఆదేశించారు. గుంతకల్లు మండలం నెలగొండ గ్రామంలో గత కొన్ని నెలలుగా ఇంటింటికీ రేషన్ సరఫరా నిలిచిపోవడం, గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు రేషన్ డీలర్ వద్దకెళ్లి సరుకులు తీసుకునేందుకు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల కలెక్టర్, జేసీ, డీఎస్‌ఓకు గ్రామస్తులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ మంగళవారం ఉదయం సీఎస్ డీటీ సుబ్బలక్ష్మితో కలసి ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి ఇంటింటికీ రేషన్ పంపిణీపై ఆరా తీశారు. వచ్చే నెల నుంచి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో 'ధర్మ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

గుంతకల్లు టౌన్: పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న షికారీ నాగరాజును వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఒక కిలో బరువున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మనోహర్ తెలిపిన మేరకు... షికారీ కాలనీకి చెందిన నాగరాజు ఒడిశాలోని భువనేశ్వర్‌లో రూ.10 వేలు వెచ్చించి ఒక కిలో గంజాయిని కొనుగోలు చేసి, అక్రమంగా గుంతకల్లుకు తీసుకొచ్చేవాడు. అనంతరం ఆ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. అందిన పక్కా సమాచారంతో మంగళవారం ఉదయం నాగరాజును ఇంటిని పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో గంజాయి పట్టుబడింది. నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న అడవిపంది

- ఒకరికి గాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని లక్ష్మంపల్లి సమీపంలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని అడవి పంది ఢీ కొట్టిన ఘటనలో ఒకరు గాయపడ్డారు. వివరాలు.. పామిడి మండలం ఖాదర్‌పేటకు చెందిన నరేష్ ద్విచక్ర వాహనంపై మల్లేనిపల్లిలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. లక్ష్మంపల్లి సమీపంలో పొలాల్లోంచి వచ్చిన అడవిపంది ఢీకొనడంతో ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఘటనలో పంది అక్కడికక్కడే మృతి చెందగా నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని పామిడి ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడులో ఉన్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఇటీవల ఒడిశాలో జరిగిన రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్, రోప్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థి నవ్యశ్రీ (8వ తరగతి) బంగారు పతకం, ఇందు (8వ తరగతి) వెండి పతకాన్ని సాధించారు. వీరు 13 నుంచి 15వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల పీఈటీలు వరలక్ష్మి , తేజశ్విని, శ్యామలా దేవి, హేమ, శ్యామలమ్మ అభినందించారు.

టీడీపీ నేతల దుశ్చర్య



మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ ఇంజిన్

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తోటకు స్థానిక టీడీపీ నాయకులు నిప్పు పెట్టారు. బాధితుడు తెలిపిన మేరకు కొర్రపాడుకు చెందిన రైతు పరమేష్ తనకున్న 2.86 ఎకరాల్లో 500 చీనీ చెట్లను సాగు చేస్తున్నాడు. రస్తా విషయంగా టీడీపీ కార్యకర్తలు పరమేష్, తలారి నాగభూషణ, నాగేంద్ర, హరితో ఆయనకు కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే ఆయనపై పలుమార్లు దాడులు జరిగాయి. ఈ క్రమంలోనే మంగళవారం పరమేష్ తోటకు నాగభూషణ, నాగేంద్ర, హరి నిప్పు పెట్టారు. దీంతో 450 చెట్లు, డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పేలోపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఘటనపై పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

డిగ్రీ ఫలితాల విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఇవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలు బుధవారం జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు.

ఆలూరును కలసిన శైలజానాథ్



ఆలూరు సాంబశివారెడ్డి స్వగృహంలో సమావేశమైన సాకే శైలజానాథ్, నాయకులు

శింగనమల: మాజీ మంత్రి సాకే శైలజానాథ్ కొద్ది రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో చేరిన విషయం విదితమే. ఈక్రమంలో శింగనమల నియోజకవర్గానికి చెందిన నాయకులను శైలు మర్యాద పూర్వకంగా కలుస్తున్నారు. మంగళవారం శింగనమల నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆలూరు సాంబశివారెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, యల్లనూరు జెడ్పీటీసీ సభ్యుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగతి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ మాజీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, పలువురు ఎంపీపీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధినేతతో గోరంట్ల మాధవ్ భేటీ



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయనకు వైఎస్ జగన్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని పెన్నానది ఒడ్డున బైపాస్ రోడ్డులో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో రెండు మోటర్ సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. పట్టణంలోని బంకమడి వీధికి చెందిన చాకలి రాముడు (48) మృతి చెందగా శ్రీనివాసపురానికి చెందిన మల్లికార్జున, జాఫర్‌కు గాయాలయ్యాయి. వ్యక్తిగత పనులను చూసుకుని స్వస్థలాలకు రాముడుతోపాటు మరో వ్యక్తి మోటర్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా మరో మోటర్ సైకిల్‌లో జాఫర్, మల్లికార్జున వచ్చి ఢీకొట్టారు. వెంటనే రాముడు మోటర్ సైకిల్‌లో ఉన్న వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురినీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చాకలి రాముడు మృతి చెందాడు. రాముడికి భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ప్రసవం!

గార్లదిన్నె: లైంగిక దాడికి గురైన బాలిక సోమవారం రాత్రి ఆడశిశువుకు జన్మనిచ్చింది. వివరాలు.. ఉరవకొండ ప్రాంతానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం కొన్నేళ్లుగా గార్లదిన్నెలోని ఇందిరమ్మ కాలనీలో గుడిసె వేసుకుని నివాసముంటోంది. వీధుల్లో సంచరిస్తూ చెత్త సేకరించి గుజరీకి వేయడం ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగించేవారు. వారి కుమార్తెపై కన్నేసిన స్థానిక యువకుడు మాయమాటలతో ఆమెను లోబర్చుకుని పలుమార్లు అత్యాచారం జరిపాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం కడుపు నొప్పితో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు ఆస్పత్రికి పిలుచుకెళ్లి చూపించారు. పరీక్షించిన వైద్యులు ఆ బాలిక గర్భంతో ఉన్నట్లుగా నిర్ధారించడంతో అసలు విషయాన్ని బాధితురాలి ద్వారా రాబట్టుకున్న తల్లిదండ్రులు ఈ నెల 6న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి బాలిక అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చింది. సోమవారం రాత్రి ఆడశిశువుకు జన్మనిచ్చింది.

శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే చర్యలు



గుడిపాడులో మాట్లాడుతున్న సీఐ ఈరన్న

యాడికి: శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారెవరైనా ఉపేక్షించేది లేదని సీఐ ఈరన్న హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని కమలపాడు, కుందనకోట, గుడిపాడు, నిట్టూరులో గ్రామసభలు నిర్వహించారు. ఏదైనా సమస్యుంటే ముందుగా పోలీసులకు తెలపాలన్నారు. సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నియమాలు, డయల్ 100, సైబర్ వలంటీర్ గురించి వివరించి, ప్రజలు సైబర్ క్రైమ్ బారిన పడకుండా జాగ్రత్తపడాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో పోలీసులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

శింగనమల: గ్రామ సచివాలయాల్లో పని చేసే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. మంగళవారం శింగనమలలోని గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరును పరిశీలించారు. ముగ్గురే సిబ్బంది ఉన్నారని, మిగిలిన వారు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓలు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. గ్రామంలో సర్వే చేస్తున్నట్లు ఫోన్ ద్వారా ఎంపీడీఓ తెలిపారు. సిబ్బంది అందరూ అందుబాటులో ఉండి, ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పామిడి: భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ధ్యేయమని తహసీల్దార్ శ్రీధరమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని పాళ్యంతండాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. అపరిష్కృత సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్‌నాయక్, మండల సర్వేయర్ మురళీధర్, రీసర్వే డీటీ విజయ్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

లారీ దూసుకెళ్లి వ్యక్తికి గాయాలు


గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున లారీ దూసుకెళ్లి బాలరాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలో నిర్వహించే రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో తిరుపతికి చెందిన బాలరాజు గాజుల అంగడి ఏర్పాటు చేసుకున్నాడు. రోడ్డు పక్కన దుకాణంలో రాత్రి నిద్రిస్తుండగా గుత్తి వైపు వస్తున్న లారీ వేగంగా అతడిపై నుంచి దూసుకెళ్లింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీసుల తనిఖీ

తాడిపత్రి రూరల్: పట్టణ సరిహద్దులో గంజాయి తాగడానికి వ్యక్తులు ఎంపిక చేసుకున్న పలు ప్రాంతాలను మంగళవారం ఎస్ఐలు ధరణిబాబు, కాటయ్య, సిబ్బంది తనిఖీ చేశారు. బైపాస్ రోడ్డు, మునిసిపాలిటీకి చెందిన ఎస్‌టీపీ-1 పరిసర ప్రాంతాల్లో పాడుబడ్డ ఇళ్లు, ముళ్ల పొదలను పరిశీలించారు.







భక్తుల కొంగు బంగారం బొలికొండ రంగనాథుడు





రంగనాథస్వామి తేరును పరిశీలిస్తున్న ఏసీ ఆదిశేషునాయుడు, మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. బొలికొండ రంగనాథస్వామి ఆలయ చుట్టు పక్కల గ్రామాల్లో రంగనాథుడిని ఇంటి దేవుడుగా కొలుస్తూ వారి ఇళ్లలోని పిల్లలకు రంగనాయకులు, రంగస్వామి, రంగనాథ్, రంగయ్య, రంగమ్మ, లక్ష్మీరంగమ్మ అనే పేర్లను పెట్టుకుంటారు. అలాగే ఈ గ్రామాల్లో తిరునాలను అతి పెద్ద పండుగగా జరుపుకుంటారు. బంధుమిత్రులను ఆహ్వానించి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

రంగనాథ స్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో జరుగుతున్న బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు పరిశీలించారు. మంగళవారం ఆయన ఆలయ పరిసరాలను తనిఖీ చేశారు. బుధవారం నిర్వహించే రథోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను ఈఓ రామాంజనేయులును అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏసీ విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆలయం వెనుక మూసేసిన కోనేరులో పురాతన విగ్రహాలు ఉన్నాయని, వాటిని వెలికి తీసి సంప్రోక్షణ చేస్తామన్నారు. అలాగే ఆలయంలో నూతన గోపురాలు నిర్మాణానికి ఆలయ గ్రాంట్ రూ.25 లక్షలు, దాతల సహకారం, ప్రభుత్వ నుంచి రూ.3 కోట్లు నిధుల విడుదల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఆలయం చుట్టూ మాడ వీధుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రంగస్వామిరెడ్డి యాదవ్, డేగా మద్దిలేటి, ఆలయ సిబ్బంది బాలుమోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం



బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గత గురువారం ధ్వజారోహణం, అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. 11వ తేదీ గజవాహనం, కల్యాణో త్సవం నిర్వహించారు, 12న రథోత్సవం(తేరు) వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే 13వ తేదీ పార్వేట అశ్వవాహనం, 14న వసంతోత్సవం, హంసవాహనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

తొండపాడులోని ప్రసిద్ధ మాణిక్య, బొలికొండ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధితో పాటుగా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం తొండపాడులోని రంగ కల్యాణ మండపంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త మాకం శ్రీకాంత్, కార్యదర్శి అశ్వర్థ రంగయ్య, నిర్మాణ కార్యదర్శి రామరంగయ్య మాట్లాడుతూ మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూ.95లక్షల వ్యయంతో బొలికొండపైన ఉన్న లక్ష్మమ్మ గుడి వరకూ 769కి పైగా మెట్ల మార్గం, 1.25 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. లక్ష్మమ్మ ఆలయం వద్ద ఎనిమిది గదులు ఆధునీకరణ, భక్తులకు నూతన సత్రం నిర్మించామన్నారు. లక్ష్మమ్మ ఆలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేశామన్నారు. బొలికొండపై రహదారికి ఇరువైపులా డ్రైనేజీ కాలువలను నిర్మించామన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా 64 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దాతల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జి.వి.రామన్, ఉపాధ్యక్షులు బాలమోహన్, చల్లా కృష్ణరంగయ్య, సంయుక్త కార్యదర్శి మంచికంటి రామరంగయ్య, కోశాధికారి ముత్యాల వెంకటరంగయ్య, కమిటీ సభ్యులు కందగడ్ల సుదర్శన్, ముత్యాల రంగస్వామి, రామచంద్రయ్య, కలుగొట్ల కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌ను కలసిన ఆలూరు


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించారు.

గుత్తి డిపోనకు 50 బస్సులు కేటాయించాలి

గుత్తి: గుత్తి ఆర్టీసీ డిపోకు 50 కొత్త బస్సులను కేటాయించడంతో పాటు డిపోను అన్ని విధాల అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. గుత్తిలోని ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ఆయన మాట్లాడారు. గుత్తి కోట లోగో బస్సులపై వేయాలన్నారు. కొత్త బస్టాండ్ నిర్మించాలన్నారు. గతంలో ఇక్కడ 80 బస్సులు ఉండేవన్నారు. ప్రస్తుతం కేవలం 25 బస్సులే ఉన్నాయన్నారు. వెంటనే కొత్త బస్సులను కేటాయించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిపో మేనేజర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున, జ్ఞానేశ్వర్ రెడ్డి, రామచంద్ర, సాయినాథ్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

గుత్తి/తాడిపత్రి రూరల్/గుంతకల్లు టౌన్: సైబర్ నేరగాళ్లు, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఇంజినీరింగ్ విద్యార్థులకు ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి సూచించారు. గుత్తి శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం సేఫర్ ఇంటర్నెట్ డే సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. ఇంటర్నెట్, మొబైల్ డేటా వినియోగంతో దేశంలో ఆన్‌లైన్ మోసాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ఏటా వేలాది కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారన్నారు. ఫోన్, ఈ-మెయిల్, వాట్సప్‌లో వచ్చే సందేశాలకు స్పందించవద్దన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ ఆంజనేయులు, గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి మోహన్ దాస్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

▸▸ తాడిపత్రి పట్టణంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం సీఐ శివగంగాధర్‌రెడ్డి అవగాహన కల్పించారు. అలాగే పట్టణంలోని నందవరం బాలికల పాఠశాలలో ఎస్‌ఐ కాటమయ్య సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు.

▸▸ గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ రాఘవేంద్ర సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపల్ ఓబులేసు, అకడమిక్ కోఆర్డినేటర్ రవిశంకర్ శర్మ,ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణ, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ జనార్దన్‌శాస్త్రి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయకండి

గుంతకల్లు రూరల్: వేసవిలో మండలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సర్పంచులు, ఎంపీటీసీలకు ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, ఎంపీపీ బీవీ మాధవి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులకు వివరించారు. వేసవి దృష్ట్యా మండలంలో క్రాష్ ప్రోగ్రాం చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో భాగంగా పాడైపోయిన చేతిపంపులు, పైప్‌లైన్ మరమ్మత్తులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫాతిమా తెలిపారు. జీ.కొట్టాలలో రూ.10లక్షల వ్యయంతో సీసీ డ్రైన్స్ చేపడతామన్నారు. ఏఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో ఐడీ నంబర్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులుఫారంపాండ్ల నిర్మాణానికి ముందుకు రావాలని ఏపీఓ క్రిష్ణమూర్తి సూచించారు. మండలంలో ఐదు ఎండీయూ డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో లైసెన్సు కలిగిన డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కదిరప్ప, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి

జంక్షన్‌లో అనుసంధాన పనులకు శ్రీకారం

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే జంక్షన్‌ను మరింత అభివృద్ధి పరచడంలో భాగంగా త్వరలోనే ప్లాట్‌ఫారాల అనుసంధాన పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. ఎలక్ట్రిఫికేషన్ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని రైల్వే హైస్కూల్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఇంటర్ స్కూల్ కాంపిటేషన్ పోటీలు నిర్వహించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం ప్రోత్సాహక బహుతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా డీఆర్ఎంతోపాటు ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీఎస్‌టీఈ (ట్రాక్షన్) సుదర్శన్‌రెడ్డి, సీనియర్ డీపీఓ క్యాప్రిల్ ఆరోరా తదితరులు హాజరయ్యారు. ఈ వందేళ్లలో ఇండియన్ రైల్వేలో సాధించిన ప్రగతి, విద్యుద్దీకరణ ప్రాముఖ్యతను డీఆర్ఎం వివరించారు. అంతకముందు విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి, అనంతరం డీఆర్ఎం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డివిజన్‌లో దాదాపు 97 శాతం విద్యుద్దీకరణ పూర్తి చేశామన్నారు. అంతేకాకుండా చిన్న పనులు మినహా గుంతకల్లు ఎలక్ట్రికల్ షెడ్ పూర్తయిందన్నారు. ఈ షెడ్ దాదాపు 250 ఎలక్ట్రికల్ రైలింజన్ మెయింటెన్ చేయవచ్చన్నారు. ముఖ్యంగా గుంతకల్లు జంక్షన్‌లోని 7, 6, 5 ప్లాట్‌ఫారాలను 1, 2, 3లో అనుసంధాన చేసే పనులను తర్వలోనే ప్రారంభిస్తామన్నారు. అందులో భాగంగా 7, 6 ఫ్లాట్‌ఫారాల్లోని పాత భవనాలను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వే హైస్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, సీనియర్ డీసీఎం మనోజ్‌కుమార్, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రోత్సాహక బహుతులను అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లిలో ఓ బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఓ బాలికకు మరో పది రోజుల్లో సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిశ్చయించారు. గ్రామానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు ఈ విషయాన్ని 1098కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు నాగేశ్వరి, గౌరి మంగళవారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలిక తల్లిండ్రులు, బంధువులను సచివాలయం వద్దకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని గుత్తి తహసీల్దార్, పోలీసుల ఎదుట హాజరుపరిచారు. మైనర్‌కు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించారు. బాలికకు వివాహం నిలిపివేసేలా తల్లిదండ్రులను ఒప్పించారు.




దేవర కొండపై వెలిసిన కొండ మీద రాయుడు

రారండోయ్ వేడుక చూద్దాం

- నేడు కొండమీదరాయుడి రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో బుధవారం కొండమీదరాయుడి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 11 గంటలకు శ్రీవారిని సతీసమేతంగా సూర్య ప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగించనున్నారు. మధ్యాహ్నం స్వామి రథోత్సవం ఉంటుంది.

ప్రత్యేక ఏర్పాట్లు


రథోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. తేరును సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. దేవరకొండపై కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండ మీదకు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు సిద్ధంగా ఉంచారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట, మార్కండేయస్వామి ఆలయం ఎదుట అన్నదానం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవం సందర్భంగా బీకేఎస్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దేవర కొండపైకి ప్రవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలకు అనుమతి ఉండదని సీఐ తెలిపారు. చోరీలకు, ఘర్షణలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ పర్యవేక్షణలో ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 20 మంది ఏఎస్ఐలు, 50 మంది పోలీసు, 50 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది బందోబస్తుకు కేటాయించామన్నారు.

డ్రోన్ కెమెరాతో నిఘా

కొండమీద రాయుడి తిరునాల సందర్భంగా డ్రోన్ కెమెరా నిఘాతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కొండమీద రాయుని ఉత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. పెద్ద వాహనాలు బీకేఎస్ మండల కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. రథోత్సవం ప్రదేశంలో పోలీసులు రోప్ వే సహాయంతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసులకు ప్రజలు, భక్తులు సహకరించాలన్నారు.


ముస్తాబైన రథం


కొండపై ఏర్పాటు చేసిన బారికేడ్లు


దేవరకొండపైన కొండమీదరాయుడి ఆలయం